


## చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# భలే దొంగ
## { డొనాల్డ్ ఓల్సన్ కథకి స్వేచ్ఛానువాదం}
(కథాకాలం సెప్టెంబర్ 97)

**అరవై పైబడ్డ** ఫ్లోరాకి అంతర్గత హెచ్చరిక వినపడితే ఇక ముందుకి వెళ్ళదు. శతృభూమిలో స్కౌటింగ్ చేసే సైనికుడిలా ఆవిడ సదా చుట్టుపక్కలవారిని గమనిస్తూంటుంది. తనవంక చూసే కళ్ళల్లోని అనుమానాన్ని తేలిగ్గా పసికట్టేంత అనుభవం ఆవిడకుంది.

ఫ్లోరా గౌరవప్రదంగా కనిపిస్తుంది. బీదరాలుగా కనిపించదు. టి.వి ప్రోగ్రామ్స్ కి బానిస అయిన ఆవిడ అవసరం ఏర్పడితే తప్ప ఇంట్లోంచి బయటికి వెళ్ళదు. ఆవిడ తరచు మిల్‌బ్రూక్ మాల్‌కి 'షాపింగ్'కి వెళ్తుంది. షాపింగ్ సరైన పదంకాదు. చూపరులకి ఆవిడ అలాగే కనిపించినా నిజానికి మిసెస్ ఫ్లోరా షాప్ లిఫ్టింగ్‌కి అక్కడికి వెళ్తూంటుంది. ఆవిడకి అలాంటి ఖరీదైన మాల్స్‌లో కొనగల స్థోమత ఎన్నటికీ లేదు. ఆవిడ నివసించే జూబ్లీ స్ట్రీట్‌లోని వారంతా ఆవిడలా బీదవారే.

ఈ రోజుల్లో సూపర్‌బజర్లలో, మాల్స్ లో వ్యాపారాత్మక డిటెక్టివ్‌లు పనిచేస్తూండడంతో కొన్ని సందర్భాల్లో ఆవిడకి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. కాని ఆల్కహాల్స్‌కి, డ్రగ్స్‌కి అలవాటు పడ్డవారు ఆరోగ్యం చెడిందని తెలిసీ మానలేనట్లుగా ఆవిడ షాప్ లిఫ్టింగ్‌కి ఎంతగా అలవాటు పడిందంటే, తను పట్టుబడచ్చన్న భయం ఉన్నా ఫ్లోరా దాన్ని ఆపలేకపోతోంది.

చివరికి ఆ మార్చ్ నెల్లో వర్షం కురిసే సమయంలో ఆవిడకి అలాంటి సందర్భం తారసపడింది.

మాల్‌లోని పెద్ద షాపుల్లో ఒకటైన స్ట్రెయిన్స్‌లో పాదరక్షలు సేల్‌లో ఉన్నాయి. ఆవిడ చాలాకాలంగా ఆ షాపులోకి వెళ్ళడంలేదు. గతంలో జరిగిన సంఘటనలో సెక్యూరిటీ గార్డ్ ఆవిడని పట్టుకుని దాని యజమాని దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆ షాప్ యజమాని ఆవిడ నిజంగా డబ్బు చెల్లించడాన్ని మర్చిపోయి బూట్లతో బయటికి నడిచిందన్న ఆవిడ కథనాన్ని నమ్మాడు. ఫ్లోరా ఎంత గొప్పనటంటే, దేవుడి ఎంతటి అమాయకమైన మొహాన్ని ఇచ్చాడంటే, ఆవిడ వయసుని కూడా పరిగణనలోకి తీసుకుని ఆవిడ మాటలని అంతా తేలిగ్గా నమ్ముతారు.

ఆవిడ ఆ షాపులోకి ఆరోజు వెళ్ళడానికి కారణం అందులో చవకగా అమ్ముతున్నారని కాదు. అది రద్దీగా ఉండటంవల్ల. అందరినీ గమనించే సెక్యూరిటీ గార్డ్ దృష్టిలో తను పడే అవకాశం బాగా తగ్గుతుందని.

ఆవిడ తనకి నచ్చిన బూట్లని తనతో తెచ్చిన సంచిలో వేసుకుని, లోపల ప్రత్యేకంగా కుట్టుకున్న సన్నటి జిప్‌ని మూసింది. ఆ సంచి రంగులోనే ఆ జిప్ ఉండటంతో పైనించి చూస్తే అది కనపడక అడుగుభాగంలో ఏం లేదని చూసేవారికి అనిపిస్తుంది. కాళ్ళకి తొడుక్కున్న బూట్లు కొత్తవని గమనించి పట్టుకుంటారని అనుభవం మీద ఆవిడకి అర్థమైంది. కాబట్టి ఈసారి ఆ పొరపాటు చేయలేదు.

ఆవిడ బయటికి వచ్చి పార్కింగ్‌లాట్‌లోని తన కారువైపు అడుగు వేసింది. అకస్మాత్తుగా ఆవిడకి వెనకనించి గట్టిగా అరుపు వినిపించింది.

"ఆగు. వెనక్కిరా."

ఫ్లోరా నియమాల్లో ఒకటి షాప్‌లోంచి దొంగతనం చేసి బయటికి వచ్చాక ఎప్పుడూ వెనక్కి తిరిగి చూడకు. దొంగిలించనివారు ఎన్నడూ ఆ పని చేయరు. దొంగలే చూస్తారు. తను నేరస్తురాలిలా ప్రవర్తించకూడదని నడక వేగాన్ని కూడా పెంచలేదు.

"నిన్నే. నీలం రంగు గౌను, ఎర్ర బూట్లు. ఆగు."

ఆ షాప్ సెక్యూరిటీ గార్డ్ తనవైపు వేగంగా వస్తున్నాడని దగ్గరయ్యే కంఠాన్ని బట్టి గ్రహించింది. ఆవిడ చేతిని అకస్మాత్తుగా మరో చెయ్యి పట్టుకుంది. తల తిప్పి చూస్తే ఓ ముప్పై ఏళ్ళ యువకుడు. ఒంటిమీద యూనిఫాం లేదు. టి షర్ట్. జీన్స్.

"నీ కారెక్కడ?" ఆదుర్దగా అడిగాడు.

"అదే. బ్లూ రంగు బ్యూక్. తాళం చెవి డాష్‌బోర్డ్‌లో."

ఆవిడ ఇలాంటి సందర్భంలో కారు తాళం చెవులని హేండ్‌బేగ్‌లోంచి వెదికి తీసే సమయాన్ని వృధా చేయకూడదని దాన్ని కారు డేష్ బోర్డ్‌లో ఉంచుతుంది. కారు తలుపుకి తాళం వేయదు.

అతను ఆవిడని డ్రైవర్ పక్క సీట్లోకి నెట్టి, తను డ్రైవింగ్ సీట్లో కూర్చునేసరికి తనవైపు తలుపు మూసి ఆవిడ అతనికి తాళం చెవిని తీసి అందించింది. అతను దాన్ని స్టార్ట్ చేసి ముందుకి పోనిస్తూ రియర్‌వ్యూ మిర్రర్‌లోకి చూసాడు. అతనికి ఫ్లోరాలో ఎంతమాత్రం భయం కనపడలేదు. ఆ కారు పార్కింగ్ లాట్‌లోంచి వేగంగా వెంబ్లో బులవార్డ్‌లోకి వెళ్ళిపోవడాన్ని సెక్యూరిటీ గార్డ్ చూసి వెనక్కి తిరిగాడు.

అతను డ్రైవ్ చేస్తూ ఆవిడ వంక తల తిప్పి చూసాడు. అతనికి ఆవిడ మొహం దేవత మొహంలా తోచింది.

"ఇంకొన్ని క్షణాలు ఆలస్యమైతే అతను నన్ను పట్టుకునేవాడు."

ప్రమాదంలోంచి బయటపడ్డాక ఆవిడలో భయం ఆలస్యంగా మొదలైంది.

"మీరు ఎక్కడుంటారు?" అతను అడిగాడు.

"జూబ్లీ స్ట్రీట్. ఐదు నిమిషాల దూరమే. నా కార్ లైసెన్స్ నంబర్ తీసుకుని ఉంటాడంటావా?" ఆవిడ గట్టిగా ఊపిరి పీల్చుకుని అడిగింది.

"అనుమానమే. మీరీ కారెక్కి మాయమవడం క్షణాల్లో జరిగింది. పైగా మీ కారు వెనక నంబర్ లేదు. కాబట్టి ముందుది చూడలేదు. మీకో గరాజ్ ఉందా?"

"ఉంది."

"మీరు దీన్ని అందులో ఎంత త్వరగా ఉంచితే అంత మంచిది."

"మీరెవరు? నన్నెలా దొంగనుకుని రక్షించారు?" ఆవిడ తేరుకుంటూ అడిగింది.

"మీరు స్ట్రాంగ్ కాఫీ చేసిస్తారని నమ్ముతున్నాను. నాకు అది తాగాల్సిన అవసరం ఉంది" అతను నెమ్మదిగా చెప్పాడు.

"తప్పకుండా. మీకది నేను బాకీపడ్డాను. నా పేరు ఫ్లోరా."

"నా పేరు డెరెక్" అతను హుందాగా చెప్పాడు.

ఆవిడ డెరెక్‌కి కాఫీతోపాటు మఫిన్స్‌ని కూడా ఇచ్చింది.

"ముందుగా నేను స్నానం చేయచ్చా? మూడు రోజులుగా చెయ్యలేదు" ఇంట్లోకి వెళ్ళాక డెరెక్ సిగ్గుగా అడిగాడు.

"తప్పకుండా. అదీ ఋణంలో భాగం. ఈలోగా కాఫీ సిద్ధం చేస్తాను. మీరు లేకపోతే నేనీపాటికి ఓ అశుభ్రమైన జైలు సెల్లో ఉండేదాన్ని. నేను నాకోసం ఎన్నడూ దొంగతనం చేయలేదు. ఒక్క వస్తువుని కూడా నేను ఉపయోగించుకోలేదు. వాటిని ఈ వీధిలో ఆడుకునే బీఓద పిల్లలకి ఇచ్చేస్తుంటాను."

"ఇళ్ళని గమనించాక ఇక్కడ నివసించేదంతా బీదలే అని గ్రహించాను."

"అంటే దొంగతనం మీకు  కొత్త కాదన్నమాట?"

"కాదు. నేనెందుకు ఈ దొంగతనాలు చేయాలి అనే ప్రశ్న నాలో తరచూ కలుగుతూంటుంది. నాకు దానికి జవాబు ఇంతదాకా తెలియలేదు."

"దీని బదులు శ్రమదానంలాంటిది చేయచ్చుగా?" డెరెక్ అడిగాడు.

"ఇది అదేగా? ప్రమాదంతో కూడిన శ్రమదానం. ఆ గార్డ్ నావెంటే పడ్డాడని ఎలా గ్రహించావు?"

"నీలంరంగు గౌను, ఎర్రబూట్లు చాలామందికుంటే గ్రహించగలిగేవాడిని కాను" డెరెక్ నవ్వుతూ చెప్పాడు.

"మా ఇంటికి అతిథులెవరూ రారు కాబట్టి బాత్‌రూములో అదనపు టవల్‌లేదు. ఇస్తానుండు" అని చెప్పి ఆవిడ డెరెక్‌కి డ్రస్సింగ్ ఛెస్ట్‌లోంచి ఒకటి తీసిచ్చింది.

అతను స్నానం చేసి వచ్చాక ఆవిడ సంచిలోంచి తను దొంగలించిన బూట్లని బయటికి తీసి చూపించి చెప్పింది.

"ఇదంతా ఎలా మొదలైందో చెప్పనా? కొన్ని సంవత్సరాల క్రితం మావారు పోయాక నేను జబ్బుపడ్డాను. సహాయం చేసేవారు ఎవరూ లేరు. డబ్బులేదు. అదృష్టవశాత్తు ఈ ఇంటిని కాపాడుకోగలిగాను. ఆరోగ్యం కుదుటపడ్డాక హోటల్లో డిష్‌వాషర్‌గా, హౌస్‌హెల్ప్‌గా ఉద్యోగాలు చేసాను."

ఆవిడ చెప్పేది అతను శ్రద్ధగా వింటున్నాడు.

"రెండేళ్ళ క్రితం నేను మాల్‌కి వెళ్తూ, తన పుట్టినరోజుకి టెడ్డీబేర్ కావాలని వీధిలోని ఓ ఆరేళ్ళ పిల్ల ఏడుస్తూ తల్లిని అడగడం విన్నాను. మాల్‌లో నాకో టెడ్డీ బేర్ కనిపించింది. కాని కొనిచ్చేంత డబ్బు లేదు. దాన్ని దొంగలించి ఆ పాపకి ఇస్తే ఎంత ఆనందంగా నవ్విందో. ఆ తర్వాత పిల్లలకి అవసరమైనవి ఇలా ఇవ్వడం నేర్చుకున్నాను. ఆ షాపు యజమానులు నా దొంగతనంవల్ల దివాలా తీయరు. ఆ పిల్లలంతా నన్ను 'ఆంటీ ఫ్లోరా' అని పిలుస్తారు. నేను భలే దుర్మార్గురాలిని కదా?"

డెరెక్ నవ్వాడు.

"నేనలా అనుకుని ఉంటే ఆ గార్డ్‌కి మిమ్మల్ని పట్టించి ఉండేవాడిని తప్ప కాపాడేవాడిని కాను."

"సరే. నీ గురించి చెప్పు. మూడు రోజులనించి ఎందుకు స్నానం చేయలేదు?"

"చెప్పడానికి ఉన్నది తక్కువ. మర్చెంట్ మెరైన్‌గా చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. నా ఓడ ఇక్కడ లంగరేసింది. రేపు తిరిగి బయలుదేరతాం. నాకు, కెప్టెన్‌కి చిన్న పోట్లాట వచ్చింది. కాబట్టి ఓడలో ఉండద్దని, హోటల్‌లో ఉండమని నా గది బాత్‌రూంలోకి నీళ్ళు రాకుండా చేసాడు. ఈరాత్రి మోటెల్‌లో గది తీసుకుంటాను. నాకు అవసరమైనవి కొనాలని మాల్‌లోకి వెళ్తూ మిమ్మల్ని చూసాను."

"ఒద్దు. స్పేర్ బెడ్‌రూం ఉంది. నాకు ఎన్నడూ అతిథి రాలేదు. కాబట్టి వారితో ఎలా ప్రవర్తించాలో, వారికేం ఇవ్వాలో నాకు తెలీదు. అవసరమైనవి నువ్వు అడక్కపోతే నాకు తెలీదు" ఫ్లోరా చెప్పింది.

"పడుకోవడానికి పక్క, బాత్‌రూంమించి అతిథికి ఇంకేం అవసరం ఉండదు. మిగిలినవన్నీ బయట దొరుకుతాయి" డెరెక్ నవ్వుతూ చెప్పాడు.

అతనికి ఆవిడ వేడి కాఫీని ఇచ్చింది.

"ఇంతదాకా పోలీసులు తలుపు తట్టలేదంటే ఆ గార్డ్ మీ కారు నంబర్ నోట్ చేసుకోలేనట్లే. నంబర్ని బట్టి ఇంటి అడ్రస్‌ని ఇట్టే కనుక్కుంటారు. ఇది చాలా పాత టేబుల్ లేంప్‌లా ఉంది?" దానివంక చూసి అడిగాడు.

"అవును."

డోర్ బెల్ మోగింది. వెంటనే ఇద్దరి మొహాల్లో భయం. ముందుగా తేరుకున్న ఫ్లోరా వెళ్ళి తలుపు తెరిచింది. ఓ పన్నెండేళ్ళ కుర్రాడు లోపలికి చిన్న బౌల్‌తో వచ్చి చెప్పాడు.

"అమ్మ మీకివ్వమంది."

"థాంక్స్. ఇవి నీకు సరిపోతాయేమో చూడు. సేల్‌లో కొన్నాను. రిటర్న్ తీసుకోరు."

వాడు చిరిగిన తన బూట్లని విప్పి వాటిని తొడుక్కుని ఆనందంగా చెప్పాడు.

"చాలా బావున్నాయి. కొద్దిగా లూజుగా ఉన్నాయి. లోపల సాక్‌ని చింపి పెడితే సరి."

"ఎదిగే పాదం నీది. త్వరలో దాని అవసరం ఉండదు."

వాడు థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. చాలాకాలంగా ఒక్కతే సాలిటైర్ ఆడే ఫ్లోరా ఆ రాత్రి అతనితో పేకాట ఆడింది. ఆవిడకి స్పేడ్స్ అనే ఆటని డెరెక్ నేర్పించాడు. డిన్నర్ టైం దాకా వాళ్ళకి కాలం తెలీకుండా గడిచిపోయింది.

డిన్నర్‌కి ఫ్రిడ్జ్‌లో బేక్డ్ పొటాటోలు, మాంసం, గ్లేంజ్డ్ కేరట్స్ ఉన్నాయి. ఆవిడ స్క్రాంబిల్డ్ ఎగ్‌ని చేసింది. ఆవిడ ఇంట్లో డిష్‌వాషర్ పాడైంది. డెరెక్ అంట్లు గిన్నెలని కడిగి తుడిచాడు.

"నా టి.వి సెట్ పాడైంది. దాన్ని బాగు చేయించడానికి ఎంతవుతుందో తెలీక షాపుకి వెళ్ళలేదు. ఓ రోజు పక్కింట్లోంచి టి.వి తీసుకెళుతూంటే చూసి 'పాత టి.వి.ని కొంటున్నారా? బాగు చేసేవాళ్ళా? అని అడిగాను. బాగుచేయడానికి తీసుకెళ్తున్నామంటే నాది చూపించాను. పది డాలర్ల వాల్వ్ వేసి తెస్తామని, తమకో పది డాలర్లు సేవారుసుముగా ఇస్తే చాలని చెప్పి వేన్‌లోకి తీసుకువెళ్ళారు. కాని వాళ్ళు దొంగలని తర్వాత తెలిసింది. పక్కింట్లోంచి వాళ్ళ టి.వి సెట్‌ని దొంగిలించి తీసుకెళ్ళడం నేను స్వయంగా చూసి పొరబడ్డాను. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మలేం."

డెరెక్ నర్మగర్భంగా నవ్వుతూండడం గమనించిన ఫ్లోరా సిగ్గుపడుతూ చెప్పింది.

"నేను వాళ్ళలా దొంగనని తెలిస్తే ఎత్తుకెళ్ళవారు కారనుకుంటున్నావా?" అడిగింది.

అతనా ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

"నేను చెడ్డదాన్ని కాను. నాలో కొన్ని లోపాలున్నాయంతే. చెడ్డతనంలో అనేక రకాలున్నాయి. నేను ఇంకొకరి ఇంట్లోని టి.వి.ని, అందులోనూ బీదవారుండే ప్రాంతంలోని ఇంట్లోంచి దొంగిలించేంత చెడ్డదాన్నికాను. పైగా నాకోసం నేనెన్నడూ దొంగతనం చేయాలనుకున్నా చేయలేరు. మీ సంచిలో పట్టేంత చిన్న టి.వి.లు ఇంకా మార్కెట్‌లోకి రాలేదు" డెరెక్ నవ్వుతూ చెప్పాడు.

"మీ ఇంట్లో నేను కొద్దికాలం వుంటే గోడలకి రంగులు వేస్తాను. కారే పంపులని బాగుచేస్తాను. వాషింగ్‌మెషిన్‌ని కూడా. నేను మెకానిక్‌ని కాబట్టి నాకు అన్ని పనులూ వచ్చు. లేదా ఓడలో ఉద్యోగం ఇవ్వరు. కాని రేపు బయలుదేరే ఓడని నేను ఎక్కి తీరాలి." అతను ఆ రాత్రి ఆవిడతో చెప్పాడు.

మర్నాడు ఉదయం ఫ్లోరా రోజూకన్నా ఆలస్యంగా నిద్రలేచింది. డెరెక్ గుర్తురాగానే అతనికి బ్రేక్‌ఫాస్ట్ చేయాలనుకుని మంచం దిగి, హౌస్ స్లిపర్స్ తొడుక్కుని లివింగ్ రూములోకి వచ్చింది. ఆవిడకి ఎగ్ స్క్రాంబిల్ చేసిన వాసన వేసింది. బల్లమీద ట్రేలో మూతలు పెట్టిన బౌల్స్‌ని చూసి వెళ్ళి వాటిని తెరిచి చూసింది. స్క్రాంబిల్డ్ ఎగ్, ఎగ్ టోస్ట్, బ్రెడ్ అండ్ జాం టోస్ట్. నాలుగో పళ్ళెంలోని కాగితం మీద "నేను వెళ్తున్నాను. లేపడం ఇష్టంలేక లేపలేదు" అని ఉంది.

తనింట్లోని ఏకైక ఖరీదు వస్తువు పాత టేబుల్ లాంప్. బరువైన మెటల్ బేస్‌మీద బిగించిన, సన్నటి స్ప్రింగ్‌కున్న దాన్ని ఎటైనా మూడువందల అరవై డిగ్రీలకి వంచచ్చు. బేస్ మీద ఇన్ అండ్ యాంగ్ బొమ్మతో పాటు చైనీస్ అక్షరాలున్నాయి. వాటి అర్థం ఆవిడకి తెలీదు. తన తల్లి పెళ్ళికి బహుమతిగా వచ్చిన అది అర్థశతాబ్దం పూర్వంది. తను

సెంటిమెంటల్‌గా దాన్ని అమ్మకుండా దాచుకుంది. దానికి ఏంటిక్ విలువ ఉందనే నమ్మకం ఫ్లోరాలో ఉన్నా, అది ఎంతకి అమ్ముడవుతుందో ఎన్నడూ కనుక్కోలేదు.

ఆవిడని మూడు బాధించాయి. మొదటిది అతను అక్కడ లేకపోవడం. మళ్ళీ ఒంటరితనం. రెండోది అతను దొంగవడం. ఆ టేబుల్ లాంప్‌ని అతను ఎత్తుకెళ్ళడం ఆవిడని బాధించింది. మూడోది దానిమీద తనకి గల సెంటిమెంటల్ అటాచ్ మెంట్ వల్ల అది పోవడం ఆవిడని బాధించింది. ఆ బ్రేక్‌ఫాస్ట్ ని చెత్తబుట్టలో కుమ్మరించి కాఫీ మాత్రం చేసుకుని తాగింది.

ఫ్లోరా ఆ రోజు బయటికి కదల్లేదు. రాకింగ్ చెయిర్లో కూర్చుని పిల్లలు ఆడే ఆటలు చూస్తూ గడిపింది. వాటి ఆటలు చూస్తూంటే కాలమే తెలీలేదు.

"డెరెక్ తనలా దొంగ కాకుండా ఉండుంటే ఎంత బావుండేది?" అని అనేకసార్లు అనుకుని నిట్టూర్పులు విడిచింది. అతను దొంగని ఆవిడ ఊహించలేదు.

సాయంత్రం ఐదున్నరకి డోర్‌బెల్ మోగితే డెరెక్ మనసు మార్చుకుని తిరిగి వచ్చాడనుకుంటూ ఆత్రంగా వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా ఇంటి ముందాగిన తెల్లటి వేన్ కనిపించింది.

"మిసెస్ ఫ్లోరా?" నీలం రంగు యూనిఫాంలోని ఒకరు అడిగారు.

"అవును?"

"దయచేసి ఇక్కడ సంతకం చేయండి."

క్లిప్ బోర్డ్‌కున్న రసీదుని, పెన్‌ని ఇచ్చి చెప్పాడు.

"దేనికి?"

"దేనికేమిటి? టి.వి అందినట్లుగా. అది డెలివరీ చేయడానికి వచ్చాం."

అతని సహాయకుడు వేన్‌లోంచి పెద్ద అట్ట పెట్టెని తీసి ఇంట్లోకి నడిచాడు. ఆవిడ యాంత్రికంగా సంతకం చేసాక ఓ కవర్ని ఆవిడకి ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ కవర్లో టి.వి బిల్, వారంటీ కార్డ్, లిటరేచర్‌తోపాటు ఇంకో చిన్న కవరుంది. దాన్ని తెరచి చూస్తే వంద డాలర్ల నోట్లు కొన్ని బయటకి వచ్చాయి. ఆ నోట్లకి పెట్టిన జెమ్ క్లిప్ కింద ఉన్న చిన్న కాగితం మీద రెండువేల మూడు వందల డాలర్లు అని రాసుంది.

ఎవరు పంపారన్న వివరం ఆ కవర్లో లేకపోయినా ఫ్లోరాకి అది తేలిగ్గా అర్థమైంది. బాధంతా మాయమై ఆవిడ మనసు ఎంతో ప్రశాంతతని పొందింది.

(వచ్చేనెల మరోకథ)

Post your comments